# బంపర్ క్రాప్



చూశారా! చూశారా! చూశారా బుచ్చమ్మ వదినా ! ఇవన్నీ. ఈ పేపర్లన్నీ చూశారా? ఏం గనిపించింది ? వాడ్డు యూ సీ? విడోస్ విడోస్ విడోస్. ఈ సీజను సీజనంతా అదే సబ్జెక్టు. బంపర్ క్రాప్! మైగాడ్ ! ఒక గిరీశానికే సింపతీ అనుకున్నారు గదూ ఇన్నాళ్ళూ? నేన్జెబితే నమ్మేరూ? ఆ పాఫోన్ ఈ గిరీశంగారు ఏవో కల్లబొల్లి కబుర్లు చెబుతారే తప్ప ఇవన్నీ నిజాలా ఏవిషీ విడ్డూరంగాపోతే అనుకున్నారు. అంతేనా. ఇపుడైనా నమ్మండి. ప్లీజ్ బిలీవ్ మీ. నాక్కల్లాకపటం తెలీవు. మా నాయనమ్మ ముప్పూటలా మొత్తుకునే దదేగదా, హయ్యో నేనేం జేతునమ్మా ఈ గిర్రాడి క్కల్లాకపటం బొత్తిగా తెలిస్చచ్చాయిగాదేం దారమ్మా. వీడెలా బతికి బట్టకడతాడమ్మా అవటాని

మైడియర్ సిష్టరిల్లా! బిలీవ్ మీ. నాకే గనక మాయదారి కబుర్లూ కపటబ్బుద్ధులూ పట్టుబడుంటే ఈపాటికి మిమ్ముల్నున్నఫలంగా ఎగరేసుకుపోయి ఏ అయిఫిల్ టవర్ మీదనో కూర్చుని కులుకుతూ మిమల్నానందపరుస్తూ ఉండేవాణ్ణి. ఏందారి మరి. మంచి గురించి మంచిగా చెబితే విన్నంటే, మాయజేసయినా దార్లో పెట్టవోయ్ అన్నారు పరబ్రహ్మశాస్త్రులవారు. నా కిన్నాళ్ళూ తెలీక అజ్ఞానం కొద్దీ ముద్దుగా చెబుతూ వచ్చాను. పోన్లెండి ఈసారికైనా తెలిసింది గద. లోకవంటే ఈ అగ్గురారవేఁ కాదనీ, ప్రపంచకవంతా మన కొంప పెరడవతలేదప్పు ఇవతల్లేదనీ ఇప్పటికైనా తెలిసింది గద. ఒక్క మీ నాయన గారే తప్ప మిగతా యావన్నంది ప్రజలున్నూ కోడై కూస్తున్నారు విడో మారియేజస్ జరగాలోయ్ అని. లేకపోతే ఇంతమంది ప్రొడ్యూసర్లు ఒక్కసారిగా ఈ యొక్క 'విడో' అను రెండక్షరాలమీద, ఈ సబ్జెక్టుమీద యిన్ని చిత్రాలు--అదిన్నీ లక్షలు గుమ్మరించి తీస్తారా? తీస్తారా మీరే చెప్పండి?

వీళ్ళంతా ప్లయిట్ ఆఫ్ ది విడోస్ అనగా మీయొక్క స్థితి గురించి యంత దుఃఖం కలగకపోతే యింత కలిసికట్టుగా ముక్తకంఠంతో దుఃఖపడి మరీ పిక్చర్లు తీశారో మీరే చెప్పండి. అక్కడితో ఆగారా, పిక్చర్లు తీసిన్నీ వాపోతున్నారింకా.

చక్కహా నేన్చెప్పినట్టు విని, మీర్రం డొదినా అనగానే సరేనని నాతో బయల్దేరి, మెడ్రాసెళ్ళిపోయొస్తే ఈపాటికి మీమీద నేన్రెండు పిక్చర్లు లాగి పారీదును గదా.

వదినా మీరు చరచరా వంటింటో కెళ్ళిపోండి-కొంప మునిగింది, నాన్నగా రొచ్చేస్తున్నారు......

అయ చిన్నవాణ్ణయినా దమకు వెయ్యేళ్ళాయుష్షనక తప్పదు. మీ మాటే అనుకున్నాం అమ్మాయీ నేనూను. మాటలో దయచేశారు. సాక్షాత్తు అగ్నిహోత్రులే తమరు. ఆయొక్క ముఖవర్చస్సలాటిది గదా. విశేషవేవిటీ అంటే అట్టి పవిత్రత మీ బిడ్డలకుా్కడా అబ్బడం. అమ్మాయి ఇప్పుడేవందో విన్నారూ! అయ్యా గిరీశంగారూ నలమహారాజు కథలో దమయంతికి రెండోపెళ్ళి అవటాని చాటింపేయించారుగదా-మరి

అది అజ్ఞాతంలో వున్న భర్తను రప్పించుకునేందుకే అయినప్పటికిన్నీ--అట్టి ఊహ పోవడమే మహాపాపం గాదుటండీ, పరిహాసానికయినా అలా అనరాదుగదా అంటోంది. ఓహో అగ్నిహోత్రావధాన్లుగారింట పుట్టినపడుచువి నీగ్గాపోతే మరెవరికింత గొప్ప ఊహలు కలుగుతాయమ్మా అని ఇందా కట్నించొక్కలాగ ఉప్పొంగి పోతున్నాను. ఇదిగో మెడ్రాసునుంచి డబ్బు రెడీ అని కబుర్రాగానే ఈ విషయమ్మీదనే ఒక బైస్కోపు అరంభించేస్తాను. తమరు తప్పక దైచేసి ఆశీర్వదించాలి.

ఏవన్నారూ ఇలాంటి ఊహల్ని బస్తీలో వింటారూ అంటారా! ఛంపేశారు. ఇంకా నయం. తమవంటి పెద్దలు ఈ దేశంలో ఓమూలవుండగా అలాటి పొగరు ఎలా సాగుతుందండీ. ఆ మధ్యనేవో వెకిలి వేషాలు వేశారుగాని ఇపుడంతా మళ్ళీ దారికొచ్చేశార్లెండి. ఇపుడు తీస్తున్న బైస్కోపులన్నీ సాక్షాత్తు మీ నోట్లొంచి ఊడిపడ్డవే అంటే నమ్మండి. వెధవది ముఖప్రీతి మాటలు చేతనై చావ్వుగాని ఈ పాటికి థెగపొగిడి పారేశేవాణ్ణి మిమ్మల్ని.

రైటే రైటే, మళ్ళీపెళ్ళి లాటి పిక్చరొచ్చినమాట రైటే. అప్పుడేదో కూశారు. విడోకి మళ్ళీ పెళ్ళి అవసరం అని. ఇప్పుడదేం లేదులెండి. చెంపలేసుకున్నారు. పవిత్రత గట్రా ఫాషనులో కొచ్చేశాయి. ఇపుడు పిక్చరులో విడోకి మొగుడు పోగానే హయ్యో నాకూతురా యంత పన్జరిగిందే అంటారు ఒక నేపజ్జప్పాటపాడి. ఆపైన పోయినవాడితో నువ్వూ పోక తప్పదు అనేంతవరకూ వచ్చేవారేమోగాని సహగమనమ్మీద సర్కారువాళ్ళ రూలోటి అహోరించింది చూడండి. అంచేత అంతమాట అన్లేకపోయినా. “ఏం చేస్తాం, ఎలాగో బతుకు వెళ్ళ మార్చుకో” అని ఓదారుస్తూ పిక్చర్లు దీస్తున్నారన్నమాట. రెండోపెళ్ళంటే మనం--అనగా జనం--మండిపడతామని వాళ్ళకెంత భయం అనుకున్నారూ. అంచేత అంతమాట చస్తే అన్రు. ప్రేవంటారా? దానికేం సోదరీ ప్రేమ వుండనేవుంది. అచ్చాలు--కాసేపు అపోహలల్లుకుందికి. ఈ లోగా గడియారం అరూ కొట్టేస్తుంది. ఎవరిళ్ళకు వారు పోవచ్చు.

చిత్తం--అంతెనండి. మిమిదొట్టు. అక్షరాలా ఇంతకన్నా ఏం చెప్పటం లేదు. ప్రేవలూ గీవలూ జాంతానై. సెకండు మారేజి సెంటిమెంటుకి ఎగినెస్టయిపోయాక ఆ మాటెత్తడానికెవడికి దమ్ములుంటాయండి! అదే చెబుతున్నాను, తవఁరిలా దేశంలో ఓ మారుమూల ముక్కుమూసుకుని జపం చేసుకుంటున్నా తమ ప్రభావం అక్కడ చెన్నపట్నంలో కథలనిండా అలుపుకుని వుంది.

ఉప్పూకారం తింటూన్న మనుషులయినపుడు, వయసులో వున్న మొగాడూ అడదీ (విడోలనుకోండి) పవిత్రతంటూ పడేడవటవేవిటి నా శార్ధవని ఒహ దుష్టుడు దూకుడుగా అనేశాడుగాని, వెంఠనే నలుగురూ వాడిగ్గడ్డెట్టారు-అఁదికేనోయ్ పెద్దలు విడోస్‌కి చప్పిడిపిండి తిండిగా నిర్ణయించారూ అని. పిండి గిట్టక పోతే ఇంగ్లీషువాడి బిస్కత్తులు తిని యాడవచ్చుగా అనిన్నీ అన్నారు. దెబ్బకి డంగైపోయాళ్లం డా దుష్టుడు.

అయ్యా అదీ సంగతి. అంచేత మనం ఇంతకుముందనుకున్నట్టుగా, ఈ సబ్జెక్టుమీద ఓ పిక్చరు లాగి పారేదాం. మీకూ ఇందున ఒక శ్రద్ధాప్రపత్తి ఉన్నాయి గాబట్టీ మీ యందు నాకున్న గురినిబట్టీ మిమ్మల్ని గూడా ఇందులో ఓపావలా వాటా తీసుకోనిస్తాను. అంతకన్న ఎక్కువ ఇవ్వడానికి వీల్లేదండి. అవతల మూడు లక్షలు రెడీ అయిపోయాయి, ఛాల్లెస్తురూ. ఈ పావలా వాటాకే, మీకు దాదాపు యాభైవేల కరుకులు దోసిట పడతాయి. ఐదుగు రాడపిల్లల్నమ్ముకున్నా ఇంతరాదు. యావంటారు, చిత్తం అలాగే ఆలోచించండి సావధానంగా. చూశారూ, ఈలోగా యీ యొక్క కథా గ్రట్రా ముందర ముసాయిదా రాసుకుందిక్కాయితాలూ గ్రట్రా కొనాలి. మీ రొండినున్న దాంటోంచి ఒక్క హస్తం ఇటు పారేస్తిరా పని ఆరంభిస్తాను. యేవిటో సెంటిమెంటొహటేడిసింది. ఓంప్రథమంగా శ్రీకారం చుట్టడానికయ్యే డబ్బు పవిత్రమైన మీ హస్తాల్లోంచి వస్తేనే రేపు లక్షలు కురుస్తాయని.

వ్వండర్‌ఫుల్ థ్యాంక్యూ.........

వాట్ మైడియర్ వెంకటేశం! నువ్వింతసేపూ ఆ భోషాణం వెనకే వున్నావా. ఏవిటి గురువుగారిమీదే స్పయింగు చేస్తున్నావా? డామిట్! గ్రాస్ యిన్గ్రాటిట్యూడు. కాపోతే

మరేవిటి చెప్పు. యేవిటీ, నిన్న చౌదరిగారికి చెప్పిన స్టోరీ అంతా మార్చేశానంటావా. అవును మరి మార్చకుండా, ఆకథ ఫాదరిల్లాకి చెబుతే చెమ్డాలెక్క దీసి తంతాడు. పైగా టెన్ రూపీస్ ఇచ్చేవాడా? నాన్సెన్స్ మనకి ఒపీనియన్సేవిటోయ్. పీపుల్స్ ట్రెండ్ అని మనకి తోచిందాన్ని బట్టి పోతాం బిజినెస్‌లో, ముఖ్యంగా ఫిలిం బిజినెస్‌లో వున్నవాడు పొలిటీషియన్‌లా, పారిస్ పడతిలా, గ్లాసులో నీరులా వుండాలి. సమయాన్ని బట్టి స్ట్రాటజీ ఫిరాయించాలి. అభిప్రాయాలేవిటి నాన్సెన్స్. అవి చాలా డేంజరస్ సరుకులు. చూస్తూ వుండగా అవే మూఢ నమ్మకా లయూరుకుంటాయి.

వాట్! ఇందులో షేరా! వెంకటేశం! అయామ్ అషేమ్డ్ ఆఫ్‌యు. దిస్ ఈజ్ గ్రాస్ క్రుయాల్టీ. ఈ కంఠశోషలిజవు కాలంలోను నువ్విలా వాదించకుండా కనీసం డబాయించకుండా, చేతిలో డబ్బులాగేసుకొని వాటా తీసుకోవడం ఏం బావు లేదు. చూస్తూవుండు నా నెక్స్‌ట్ పిక్చరులో నీకు పదెందివేల అడుగుల్లో ఒక విడోతో రొమాన్సు పెట్టించి. చివర్ని అంథా సిస్టర్లీ అఫెక్షన్ ఇచ్చి--అనగా సోదరీ ప్రేమయేనోయ్ చెవలాయ్ అని తేల్చి అవతల పారేస్తాను. ఏడుస్తూ హొరైజన్ లోకి పోతావు. అంతే.

